క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల రూరల్ : కింతలి విద్యుత్ **ఉప కేం**ద్రం నుంచి కొత్త లైన్ నిర్మాణానికి సం**బంధిం**చి మూడు గ్రామాల్లో మంగళవారం **విద్యుత్** సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్) ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గాదిరాయి సబ్‌స్టేషన్ పరిధిలో వున్న జె.డి.పేట, జాలంపల్లి, పొన్నవోలు, గ్రామ పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాలకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు.

మాడుగుల : కింతలి సబ్‌స్టేషన్‌కు కొత్తలైన్ వేయడం వల్ల గాదిరాయి సబ్‌స్టేషన్ పరిధిలో మూడు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు తెలిపారు. జేడీపేట, జాలంపల్లి, పొన్నవోలు గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన ర్యాలీ

కశింకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి మాట్లాడుతూ మే డే స్ఫూర్తికి వ్యతిరేకమైన కార్మిక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను నాన్ లేబర్ కోడ్‌లుగా కుదించి పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా కొత్త చట్టాలను ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకించి దేశ వ్యాప్త సమ్మె చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. మహిళలకు రాత్రి షిఫ్టుల్లో పని చేయాలని, చట్టసభల్లో చట్టం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

పాడిరైతుల ఆందోళన


వినతిపత్రం ఇస్తున్న రైతులు

నాతవరం : పశువైద్యాధికారి లేక పశువులకు వైద్య సేవలు అందకపోవడంతో పాడి రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలో గల పశువైద్యశాలకు సోమవారం కొందరు రైతులు తమ పశువులను వైద్యం కోసం తీసుకువచ్చారు. ఉదయం పది గంటలు దాటినా పశువైద్యకేంద్రానికి ఎవరూ రాకపోవడంతో గంటల తరబడి నిరీక్షణ చేసిన రైతులు ఆగ్రహించారు. ఏడాది కాలంగా నాతవరం పశువైద్య కేంద్రానికి రెగ్యులర్ వైద్యాధికారి లేరు. ఇటీవల మండల వ్యాప్తంగా ఎక్కడ చూసినా గ్రామాల్లో పశువులకు గాలి కుంటూ వ్యాధి లంపి స్కిన్ వ్యాధి సోకడంతో పశువులు ఇబ్బంది పడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం పశువైద్యశాల ముందు రైతులు ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి సూపరింటెండెంటు పోలుపర్తి పార్థసారథికి వినతి పత్రం ఇచ్చారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించే బాధ్యత అధికారులపై ఉందని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మర్రిపాలెం పంచాయతీలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై డ్వాక్రా మహిళలు ద్వారా ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, వెలుగు ఏపీఎం కనకరాజు, వ్యవసాయ శాఖ ఏవో సుగుణ, జేఈలు జోగారావు, శ్రీవెంకటేశ్వరమ్మ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు నేతల విజయకుమార్, పారుపల్లి కొండబాబు, గన్నవరం, నాతవరం, పి.కే.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు సింగంపల్లి సన్యాసిదేముడు, అపిరెడ్డి మాణిక్యం, అంకంరెడ్డి నానిబాబు పాల్గొన్నారు.

వి.సంతపాలెంలో వైద్యశిబిరం

కె.కోటపాడు : స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మహిళలకు ప్రత్యేకంగా చేపడుతున్న వైద్య శిబిరాలను మహిళలు ఉపయోగించుకోవాలని వి.సంతపాలెం ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగంపల్లి వెంకటరమణ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం లంకవానిపాలెం వైద్య సిబ్బంది స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు జరిపారు. ఈ వైద్య శిబిరాన్ని వెంకటరమణ ప్రారంభించారు. 137 మందికి పీహెచ్‌ఎస్ ప్రమీలా వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. ఏఎన్ఎం మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు పైడితల్లమ్మ, తులసి, ఆశా కార్యకర్త సైదాబీ పాల్గొన్నారు.

పచ్చ నేత నిర్వాకం.. పచ్చని రైతుకు శోకం

- నీరు పోయే తూరలు తొలగించి రోడ్డు నిర్మాణం
- సాగు భూముల్లో నిలిచిపోతున్న నీరు
- ఆరేళ్లుగా నాట్లు వేయలేక రైతుల దైన్యం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం


గోడు విన్నవిస్తున్న బాధిత రైతులు

నాతవరం : టీడీపీ నేత స్వలాభం కోసం నిర్మించిన రోడ్డుతో చెరువులోకి వెళ్లే నీరు ప్రవహించక మా పంట పోలాలు ముంపునకు గురయ్యేలా చేసారని రైతులు కలెక్టరుకు ఫిర్యాదు చేసారు. టీడీపీ నేత చేసిన నిర్వాకం కారణంగా పది ఎకరాలకు పైగా తమ భూమిలో వరినాట్లు వేయకుండా నీటి ముంపునకు గురి చేయడంతో రైతులు సోమవారం ఆందోళన చేసి వారుపడే బాధలు సోమవారం విలేకరులకు తెలిపారు. మండలంలో శృంగవరం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఉలబాల అప్పలనాయుడు ఆరేళ్ల క్రితం గత టీడీపీ హయాంలో గ్రామం నుంచి తన వ్యవసాయ భూమిలో నిర్మించిన జీడి పిక్కల పరిశ్రమ వరకు రోడ్డు వేశారు. కొంత దూరం సిమెంటు రోడ్డు మరికొంత దూరం గ్రావెల్ రోడ్డు వేశారు. ఈరోడ్డు వేసేటప్పుడు రాజు చెరువు నుంచి పెద్ద చెరువులోకి నీరు ప్రవహించేందుకు గతంలో గెడ్డపై మూడు చోట్ల ఏర్పాటు చేసిన తూరలను తొలగించారు. ఆ సమయంలో నీరు ప్రవహించే తూరలు తొలగిస్తే తమ పంట పొలాలు ముంపునకు గురవుతాయని ఈ ప్రాంత రైతులు అప్పలనాయుడు దృష్టికి తీసుకొచ్చారు. అయితే రోడ్డు పని పూర్తి చేశాక నీరు పోయేందుకు తూరలు ఏర్పాటు చేస్తానని నమ్మబలికారని రైతులు తెలిపారు. కానీ రోడ్డు పూర్తయినా తూరలు వేయకపోవడంతో తమ వ్యవసాయ భూమిలోకి ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో నీరు చేరి చెరువులా మారిపోతోంది. దీంతో ఆరేళ్లుగా ఆయా భూముల్లో నాట్లు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు వరినాట్లు వేయక బతుకు దెరువుకోసం ఇతర ప్రాంతాలకు వలస పోయారన్నారు.


చెరువులా మారిన సాగు భూమి


తూరలు ఏర్పాటు చేయకుండా వేసిన రోడ్డు

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు

సర్వే నంబర్లు 171, 173, 174, 175 తదితర జిరాయితీ భూములు 10 ఎకరాలకు పైగా ఉన్నాయన్నారు. సొంత భూములు ఉన్నా ప్రతి ఏటా నీటిముంపునకు గురి కావడంతో పది ఎకరాలకు పైగా భూముల్లో పంటలు వేయకుండా వృథాగా వదిలేశామని రైతులు వాపోయారు. ప్రభుత్వ నిధులతో నిబంధనలు ఉల్లంఘించి తన సొంత ఫ్యాక్టరీకి రోడ్డు వేసుకుని నీరు ప్రవహించకుండా అడ్డుకట్ట వేశారన్నారు. దీనిపై ఈనెల 14వ తేదీన కలెక్టరుకు ఫిర్యాదు చేశామని బాధిత రైతులు అల్లు యరకయ్యనాయుడు, ఉలబాల వెంకట సత్యవతి తదితరులు విలేకరులకు తెలియజేశారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి రోడ్డు వేయకముందు ఏవిధంగా నీరు ప్రవహించిదో అదే విధంగా నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కనుల పండువలా దుర్గామల్లేశ్వర తిరువీధోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట : సీతయ్యపేట దుర్గామల్లేశ్వర అమ్మవారి దుర్గాష్టమి సంబరానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా తిరువీధోత్సవం నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం, చండీ హోమం, దుర్గాష్టమి పూజ, అమ్మవారి తిరువీధి ఉత్సవం, అగ్నిగుండం తొక్కుట, క్షీరాభిషేకం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. పది వేల మందికి ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను అమర్‌నాథ్ ప్రారంభించారు. సాయంత్రం మేళతాళాలు, సన్నాయి మేళాలు, డప్పులు, వాయిద్యాలు, చిడతల భజనలు, నేలడాన్స్‌లు, తప్పెటగుళ్లు, బాజా భజంత్రీలతో అమ్మవారి సంబరం సాగింది. పలువురు భక్తులు ఒంటికి శూలాలు గుచ్చుకోగా, మరికొందరు అమ్మవారి అగ్నిగుండం తొక్కి భక్తిని చాటుకున్నారు.

పులి పిల్లా.. అడవి పిల్లి పిల్లా!



బుచ్చెయ్యపేట : ఐయితంపూడి గ్రామంలో పిల్లి పిల్ల రైతులను పరుగులు పెట్టించింది. సోమవారం గ్రామానికి చెందిన రైతు పెద్దాడ శ్రీను తన పొలంలో పని చేస్తుండగా వెనక నుండి వచ్చిన పిల్లి పిల్ల కరవడానికి చూడడమే కాక పులిలా గాండ్రించింది. పులిని పోలిన చారలు ఉండడంతో శ్రీనుతో పాటు గ్రామ రైతులు దానిని పులి పిల్లగా భావించి కంగారు పడ్డారు. దానిని పట్టుకుని బుచ్చెయ్యపేట పశువైద్యాధికారులకు సమాచారం అందించారు.

ఆలయ భూములను కాపాడండి

దేవరాపల్లి : గ్రామంలో ప్రజా సమస్యలపై పీజీఆర్ఎస్‌లో సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు గ్రామానికి చెందిన వరదపురెడ్డి లలితానాయుడు, చొక్కాకుల వెంకటరమణ, కె.వి.రమణ, కొరుప్రోలు శ్రీను, గంగవంశం సంతోష్ తెలిపారు. దేవరాపల్లి ఉమామహేశ్వరీ ఆలయానికి సంబంధించి దేవదాయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఆక్రమణలు తొలగించి భూములు పరిరక్షించాలని కోరినట్టు తెలిపారు. దేవరాపల్లి నుంచి కొత్తవలస మీదుగా విశాఖ వెళ్లే రహదారిలో కృష్ణారాయుడుపేట సమీపంలో కల్వర్టు కుంగడంతో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

నాతవరం: దసరా పండగ సందర్భంగా గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు అన్నారు, మండలంలో వై.డి.పేట గ్రామంలో సోమవారం ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి పంచాయతీలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంపై సదస్సులు ఏర్పాటు చేసి చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పొందడంపై అవగాహన కల్పిస్తానన్నారు. యువకులు చెడు వ్యసనాలు వైపు దృష్టి సారించకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు.

మట్టి తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అచ్యుతాపురం రూరల్ : దొప్పెర్ల గ్రామంలో అక్రస్తులు సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దొప్పెర్ల గ్రామ రెవెన్యూ పంచాయతీ సర్వే నంబర్ 40లోని గంగునాయుడు చెరువులో అనధికారికంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాగ్దేవికి ప్రణమిల్లి..


మాకవరపాలెంలో సరస్వతీదేవికి పూజలు


దేవీతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు, ఎంపీపీ రాజారామ్


మాడుగులలో దుర్గా పోలిపల్లెమ్మకు సారె ఊరేగింపు


ఏఎల్‌పురంలో చిన్నారులతో అక్షరాభ్యాసం


వేచలంలో అగ్ని గుండం తొక్కుతున్న భక్తులు


బలిఘట్టంలో సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ


కొత్తకోటలో పూజలు

మాడుగుల/మాడుగుల రూరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గా పోలిపల్లెమ్మ మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు భారీ స్థాయిలో అమ్మవారికి సారె ఊరేగించి సమర్పించారు. ఆలయ కమిటీ అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు ఉచితంగా అందజేశారు. అనంతరం భక్తులకు మజ్జిగ, పులిహోర ప్రసాదంగా అందజేశారు. దేవితల్లి అమ్మవారు కూడా సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్, అప్పలరాజు, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు. పుప్పాల రమేష్, అద్దేపల్లి జగ్గారావు దర్శించుకున్నారు. వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు. పాఠశాల విద్యార్థులు ఆలయంలో పూజలు నిర్వహించారు.

సరస్వతీదేవికి విద్యార్థుల పూజలు

మాకవరపాలెం : దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. పలు గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు నిర్వహించి, అక్షరాభ్యాసం చేశారు. విద్యార్థులకు నిర్వాహకులు పెన్నులు, పుస్తకాలను అందజేశారు.

గొలుగొండ: నవరాత్రుల సందర్భంగా ఏఎల్‌పురం, గొలుగొండ, కృష్ణదేవిపేట తదితర గ్రామాల్లో కనకదుర్గ ఆలయాల వద్ద చిన్నారులతో అక్షరాభ్యాసం, పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

రావికమతం: కొత్తకోట,మేడివాడ,టి.అర్జాపురం,చిలకవానిపాలెం,చినపాచిలి,రావికమతం,గుమ్మాళ్లపాడు,దొండపూడి,తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లోని అమ్మవారిని సరస్వతి దేవి రూపంలో అంకరించారు. కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో 100మంది చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం చేయించారు.

కె.కోటపాడు : చౌడువాడ శ్రీ సాయి విద్యా విహార్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమాన్ని విద్యార్థులకు నిర్వహించారు. సరస్వతీదేవికి చిన్నారులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపి అక్షరాభ్యాస కార్యక్రమాలను ప్రిన్సిపాల్ అప్పలకొండ జరిపారు.

చోడవరం : సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. వెంకన్నపాలెం కొండపై శ్రీకనకదుర్గమ్మ ఆలయం ఒకటి. ఎనిమిదో రోజున సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ దర్శనమిచ్చారు. చోడవరం పాత బస్టాండ్ దగ్గర వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని పెన్నులతో సర్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

దేవరాపల్లి: మండలంలోని వేచలం శ్రీదుర్గాదేవి మల్లేశ్వరస్వామి ఆలయ పీఠం ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాలు ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భవానీ మాలాధారణ భక్తులు శూలాలు ధరించి, ఘటాలతో ఊరేగింపుగా రామాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం అగ్ని గుండం తొక్కారు.

నర్సీపట్నం : బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతిదేవి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ఐ.శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు ఏబీఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ గిరిబాబు, అధ్యాపకులు అంకంరెడ్డి శ్రీనివాస్, మాధవనగరం హెచ్ఎం సన్యాసయ్య విగ్రహం ఏర్పాటుకు ముందుకు వచ్చారు. విగ్రహ ఆవిష్కరణకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, అధ్యాపకులు శ్రీనివాస్ దంపతులు విచ్చేశారు.

జీఎస్టీ తగ్గింపు పక్కాగా అమలు జరగాలి

దేవరాపల్లి: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలను పక్కాగా అమలు చేయాలని షాపుల యజమానులకు మండల జీఎస్టీ సమన్వయ అధికారి కేదారేశ్వరరావు సూచించారు. ఎంపీడీవో సువర్ణరాజుతో కలిసి పలు షాపులను తనిఖీ చేశారు. తగ్గించిన జీఎస్టీ ధరలకు అనుగుణంగా వస్తువులను విక్రయించకుంటే సదరు షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, పంచాయితీ కార్యదర్శి అనంత ఉమాదేవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అవినాష్ పాల్గొన్నారు.

రావికమతం: జీఎస్టీ తగ్గింపుపై రావికమతంలో ఎంపీడీవో మహేష్, తహసీల్దార్ అంబేడ్కర్, ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు సోమవారం కరప్రతాలు పంపిణీ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో జీఎస్టీ తగ్గింపుపై అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


దుకాణాల్లో జీఎస్టీ అమలుపై ఆరా తీస్తున్న అధికారులు

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు అండ

- వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్
- డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ


కె.కోటపాడులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఈర్లె అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సర్వేశ్వరరావు, ఇతర నాయకులు

కె.కోటపాడు : కూటమి పాలనలో అన్యాయానికి, అక్రమ కేసుల బారిన పడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో మనోధైర్యం కల్పించేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారని వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ అన్నారు. కె.కోటపాడులో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ఇంటి వద్ద మండలంలో పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి సోమవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రాభివృద్ధిని మరిచి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడడంతో పాటు అన్యాయంగా కేసులను బనాయిస్తున్నట్టు తెలిపారు. వారికి అండగా ఉండేందుకు పార్టీ అధినేత జగన్ డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రెడ్డి జగన్‌మోహన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, జిల్లా పార్టీ కార్యదర్శి పల్లా రాజేశ్వరరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, జేసీఎస్ మండల కన్వీనర్, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, దేముళ్లు, బోశం కృష్ణారావు, జాగరపు వెంకట రామలక్ష్మి, గంతకర్ల సతీష్, లెక్కల శంకరరావు, ఆదిరెడ్డి రామునాయుడు, నెక్కల గోపి, దాసరి శివ, పాటూరి ఈశ్వరరావు, భర్ల రావాలయ్య, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ ఎంతో అండగా ఉంటుందని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ అన్నారు. పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల విడుదల చేసిన డిజిటల్ బుక్ క్యూర్ కోడ్‌ను సోమవారం మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి డిజిటల్ బుక్ అండగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇప్పటి నుంచే కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రుత్తల సత్యనారాయణ, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, వలంటీర్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవింద, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు వాసు, భద్రాచలం పాల్గొన్నారు.

జేజేఎం అసంపూర్తి పనులతో తాగునీటికి ఇక్కట్లు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన


మాట్లాడుతున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట: జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తికాక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్టు ఎస్.కొత్తూరు, కూసర్లపూడి, పడాలపాలెం, సర్పంచ్‌లు పోతల రాజశేఖర్, మడ్డు అప్పలనాయుడు, పాచిల రామకృష్ణలు ఏఈ రమేష్ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మండలంలో తాగునీటి సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వర్షాకాలంలో కూడా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై ఏఈ రమేష్ పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు. భూ సర్వే, భూమి పట్టాల గుర్తించి సభ్యులు ప్రస్తావించగా తహసీల్దారు నాగమ్మ స్పందిస్తూ ప్రస్తుతం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి అయిందని, ప్రభుత్వ భూములు సర్వే జరుగుతుందని, ఈ గ్రామాల్లో సర్వే పూర్తి అయిన తర్వాత జగ్గంపేట గ్రామంలో రీసర్వే జరగనుందని తెలిపారు. దీనికోసం జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్య, విద్య, అభివృద్ధి పనులు, ఐసీడీఎస్, వ్యవసాయం, పౌర సరఫరాలు తదితర శాఖలు గురించి సమీక్షించారు. సమావేశంలో అధికారుల దృష్టికి సభ్యులను తీసుకొచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.

దుర్గాదేవి ఆలయానికి వెండివీణ బహూకరణ

రావికమతం : మండలంలోని కొత్తకోట దుర్గాదేవి ఆలయానికి గ్రామానికి చెందిన వ్యాపారి ఉల్లూరి రాజు దంపతులు వెండి వీణను బహుకరించారు. శరన్నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరణ కోసం వెండి వీణను సమకూర్చినట్టు దాతలు రాజు చెప్పారు. సోమవారం భక్తులు సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు వేపా రామకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులకు వెండి వీణను అందజేశారు.


కొత్తకోటలో దుర్గమ్మకు వెండి వీణను అందజేస్తున్న దాతలు

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం


ఆకు కూరలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే బండారు, సీడీపీవో

మాడుగుల : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకర సమాజం ఉంటుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక 30 పడకల ఆస్పత్రి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి బి.చంద్రశేఖర్ అధ్యక్షతన మహిళలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు ఉన్నవారు దేశంలో ఏ రాష్ట్రంలోనైనా వైద్యం చేయించుకోవచ్చునన్నారు. మెగా వైద్య శిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరిగిందన్నారు. ఎంపీపీ వెంకట రాజారామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఉండూరు దేముడు, జగ్గారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు లెక్కల కాసుబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

అంగన్‌వాడీలో అందిస్తున్న పౌష్టికాహారం ప్రతి మహిళ సద్వినియెగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఐసీడీఎస్ సీడీపీవో జి.ఎర్రయ్యమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు బయట ఆహారం తగ్గించి పెరటి తోటల్లో స్వయంగా పండించిన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కేంద్రంలో తయారు చేసిన పోషకాహార వంటకాలు ప్రదర్శన తిలకించి అభినందించారు. సీడీపీవో ఎర్రయ్యమ్మ ఆధ్వర్యంలో 20 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, కింతలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దేముడు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి సారె ఊరేగింపు

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరులో దుర్గాదేవి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దుర్గాదేవికి సారె ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలతో పాటు స్వీట్లు, అరటిగెలలను సమర్పించి గ్రామంలో ఊరేగింపు చేసారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొడ్డు ప్రకాశమ్మ, ఉపాధ్యాయుడు రవి తదితరులు పాల్గొన్నారు.


ఎ.కోడూరులో దుర్గాదేవికి సారె ఊరేగింపు

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య

కె.కోటపాడు : అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపడం వల్ల భాషాభివృద్ధి, శారీరక, మానసికాభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లలిత కుమారి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కేంద్రాల్లో పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్యతో పాటు క్రమశిక్షణ లభిస్తుందని తెలిపారు.